
ప్రజాశక్తి

సోమవారం 16 సెప్టెంబర్ 2024



కలెక్టర్‌ను కలిసిన విజిలెన్స్ ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం

విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద్ జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజిలెన్స్ ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న విజిలెన్స్ ఎస్‌పి

ఆలనాపాలనా లేని ఐటిడిఎలు

- ఏళ్ల తరబడి నిర్వహించని పాలకవర్గ సమావేశాలు
- గాలికొదిలేసిన గిరిజన సమస్యలు
- అసమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలుగా మిగిలిన వైనం



ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలో గల ఐటిడిఎలు 'అ'సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలుగా కనిపిస్తున్నాయి. ఈ సంస్థల ఆలనాపాలనా చూసే నాధుడు లేక ఉత్సవ విగ్రహాలుగా మిగులుతున్నాయి. రెండు నెలరోజులుగా ఈ రెండు ఐటిడిఎలకు పూర్తి స్థాయి ప్రాజెక్టు అధికారుల్లేని పరిస్థితి ఏర్పడింది. ఇన్‌ఛార్జి అధికారుల పాలనలో మొక్కుబడిగా కార్యకలాపాలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు మారినా ఐటిడిఎల స్థితిగతుల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. పదేళ్ల క్రితం నాటి ఐటిడిఎల స్థితి గతులతో పోల్చుకుంటే ఇప్పుడున్న సంస్థల్లో క్రియాశీలత ఏమాత్రం కూడా గోచరించడం లేదు. 1980లో గిరిజనాభివృద్ధి, సంక్షేమ మే ధ్యేయంగా ఐటిడిఎలు ఏర్పాటయ్యాయి. కొంతకాలం వరకు గిరిజన సంక్షేమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన సంస్థలుగా విరాజిల్లిన పరిస్థితి కనిపించింది. క్రమేణా చుక్కాని లేని నావ ల్లా వీటి పరిస్థితి తయారైంది. ప్రతి మూడు నెలలకో సారి జిల్లా పరిషత్, మండల పరిషత్ సమావేశాలు, నెలకోసారి మున్సిపల్ సమావేశాలు జరుగుతున్నాయి. ఏడాదిలో మూడు, నాలుగుసార్లు అసెంబ్లీ సమావేశాలు కూడా నిర్ధేశిత గడువులోగా జరుగుతున్నాయి. కానీ గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటైన ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు మాత్రం ఎప్పుడూ నిర్దేశించిన గడువు ప్రకారం జరిగిన దాఖలాల్లేవు. నిబంధనల ప్రకారం ప్రతి ఆరు నెలలుకో సారి ఐటిడిఎ పాలకవర్గ సమావేశం నిర్వహించాలి. అంటే ఐదేళ్ల కాలపరిమితిలో ఏడాదికి రెండు సార్లు పాలకవర్గ సమావేశాలు జరగాలి. గత ప్రభుత్వం హయాంలో ఒక్కసారి కూడా పాలకవర్గ సమావేశం నిర్వహించలేదు. ఈ సమావేశాలు గడువులోగా జరిగితే గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రస్తావించే అవకాశం ఉంది. గిరిజనుల కోసమే పని చేసే పాలనా సంస్థ అయినందున పాలకవర్గ సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలు వున్నాయి. గిరిజన సమస్యలు బలంగా గొంతెత్తి వినిపించగలిగేది ఇలాంటి సమావేశాల్లోనే. కానీ గిరిజనులంటే నిర్లక్ష్యమో, చులకన భావమో గానీ వారి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటున్నాయి. అసెంబ్లీ, జెడ్పీ, మండల పరిషత్ సమావేశాల్లో ఎస్టీ ఎమ్మెల్యేలు, ఎంపిపిలు, జెడ్పీటీసీలు సమస్యల్ని పరిష్కరించాలని గళమెత్తినా మాట్లాడేందుకు తగిన అవకాశాలు లభించే పరిస్థితి లేదు. గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు నిర్భయంగా, స్వేచ్ఛగా ఆదివాసీ, గిరిజనుల సమస్యలపై గొంతెత్తిడానికి వుండే ఏకైక అవకాశం ఐటిడిఎ పాలకవర్గ సమావేశం. ఇలాంటి సమావేశాలను ఏళ్ల తరబడి నిర్వహించకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వాలకు గిరిజనాభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఏమాత్రం వుందో స్పష్టంగా కనిపిస్తోంది. సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎల పరిధిలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రభుత్వాలెన్ని మారినా గిరిజనుల జీవన స్థితిగతులల్లో మార్పు కనిపించడం లేదు. కనీస రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామాలు చాలా వున్నాయి. మైదాన ప్రాంతంలోని ప్రజలకు అందుతున్న విధంగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు విద్య, వైద్యం, పౌష్టికాహారం అందని గ్రామాలనేకం వున్నాయి. గిరిశిఖర గ్రామాల్లోని గిరిజనులు వైద్యం కోసం రాళ్లు, గుట్టల దాటుకుని పదుల కిలోమీటర్ల దూరం నడిచి ప్రభుత్వాసుపత్రులకు చేరాల్సిన పరిస్థితి ఇంకా ఉంది. డోలీ మోతలు ఇప్పటికీ కళ్లముందు కదలాడుతునే వున్నాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు రక్షిత మంచినీటి సౌకర్యం అందని ద్రాక్షగానే ఉంది. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఎఎన్ఎంల నియామకం పాలకుల ప్రకటనలకే పరిమితమైంది.

గిరిజన మంత్రులున్నా ఫలితం సున్నా

మన్యం జిల్లా ఏర్పాటైన తర్వాత జిల్లా నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు గిరిజన సంక్షేమ శాఖ మంత్రులుగా పని చేశారు. గత ప్రభుత్వ హయాంలో కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి , సాలూరు ఎమ్మెల్యే రాజన్నదొర గిరిజన సంక్షేమ శాఖ మంత్రులుగా బాధ్యతలు నిర్వహించారు. వీరి హయాంలో అయిదేళ్లలో ఒకసారి కూడా ఐటిడిఎ పాలకవర్గ సమావేశం నిర్వహించలేకపోయారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటిపోయింది. ఐటిడిఎలకు జీవం పోసిన టిడిపి ప్రభుత్వమే మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖమంత్రిగా సాలూరు ఎమ్మెల్యే సంధ్యారాణి బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రభుత్వ హయాంలోనైనా ఐటిడిఎ లకు పూర్వవైభవం వస్తుందనే ఆశతో గిరిజనులు ఎదురుచూస్తున్నారు.

నెల దాటినా నియామకం కాని పిఒలు

జిల్లాలో గల సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎలకు నెల దాటినా ఇంతవరకు పూర్తి స్థాయి ప్రాజెక్టు అధికారుల నియామకం చేపట్టలేదు. గత నెల 9న రెండు ప్రాజెక్టుల అధికారులు బదిలీ తర్వాత ప్రభుత్వం నియమించలేదు. ఇన్‌ఛార్జి అధికారులతో కార్యకలాపాలు నడుస్తున్నా గిరిజన సంక్షేమం అభివృద్ధి కోసమే పని చేసిన అధికారులు లేక ప్రధాన సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రతి వారం గ్రీవెన్స్ సెల్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజనులు వినతులు అందజేస్తున్నా పరిష్కారానికి నోచుకోని పరిస్థితి కనిపిస్తోంది.





పార్వతీపురంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీదేవి; సీతంపేటలో నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

నిరంతర అధ్యయన శీలి ఏచూరి

సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సామ్రాజ్యవాదాన్ని అంతం చేయాలన్నా, సోషలిస్టు సమాజాన్ని నెలకొల్పాలన్నా గత వర్గ పోరాటాల చరిత్రలను సమర్ధవంతంగా అధ్యయనం చేపడితేనే కమ్యూనిజాన్ని సాధించగలమని సీతారాం ఏచూరి ప్రతి శిక్షణా తరగతిలో బోధించేవారని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. సిపిఎం పార్వతీపురం నియోజకవర్గ రాజకీయ శిక్షణా తరగతులు మండలంలోని బంటువానివలసలో రెండు రోజుల పాటు జరుగుతున్న సందర్భంగా తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రతినిధులంతా మౌనం పాటించి ఏచూరి మతికి సంతాపం తెలిపారు. అనంతరం వేణు మాట్లాడుతూ దేశ రాజకీయాలపై సీతారాం ఏచూరిది చెరగని ముద్ర అని, అనారోగ్యంతో ఏచూరి మృతి చెందినప్పటికీ ఆయన మార్క్సిస్ట్ అధ్యయన ఆనవాళ్లు చెరగని ముద్రలు చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. ఏచూరి పార్టీ కార్యక్రమాలను ప్రణాళిక బద్ధంగా నిర్వర్తించేవారని, రాజకీయ ఒడిదుడుకులు ఎన్ని ఎదురైనప్పటికీ దాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొనేవారని అన్నారు. విద్యార్థి దశ నుండే శాస్త్రీయ భావాలు కలిగిన ఏచూరి వామపక్ష భావజాలంతో ఉండేవారని, ఢిల్లీ జెఎన్‌యుకు మూడుసార్లు అధ్యక్షులుగా వ్యవహరించి, అక్కడ మతోన్మాదంపై రాజీలేని పోరాటం నిర్వహించారని గుర్తు చేశారు. చట్టసభల్లో బడుగుల వాణి వినిపించేందుకు కృషి చేశారని కొనియాడారు. దేశంలో రైతులు, ప్రాథమిక ప్రజల, కార్మికుల విముక్తి కోసం తన రాజకీయ జీవితాన్ని త్యాగం చేసిన ఆయన సంఘ్ పరివార్, మతతత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరులో సవాళ్లను ధీటుగా ఎదుర్కొన్నారని, అనేక దశల్లో, అతను జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే రాజకీయ ఎత్తుగడలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఏచూరి జీవితం కమ్యూనిస్టు ఉద్యమానికి ఆదర్శ నిలయమని, ఆయన ఆశయ సాధన కోసం యావత్తు పార్టీ మొత్తం కంకణం కట్టుకొని పనిచేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వై.మన్మధరావు, వి.ఇందిర, బంటు దాసు, బి.సూరిబాబు, రెడ్డి లక్ష్మణ్నాయుడు, రెడ్డి ఈశ్వరరావు, జి.తులసి, గౌరీ, భవాని, డి పండు, బలరాం, వి.చిన్నంనాయుడు, ఆర్. రాము తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : పేదల సమస్యలపై రాజీ లేని పోరాటం చేసిన మేధావి ఏచూరి అని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. కొమరాడలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళి జరిగింది. ఈ సందర్భంగా సాంబమూర్తి, ప్రజాసంఘాల నాయకులు లక్ష్మయ్య, రెడ్డి శివున్నాయుడు, సంఘం నాయుడు మాట్లాడుతూ ఏచూరి ఆశయాల సాధన దిశగా అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేయాలని, అలా పోరాటం చేసి సమస్యలు పరిష్కరించుకోవడమే ఆయనకిచ్చిన నిజమైన నివాళి తెలిపారు. కార్యక్రమంలో సుబ్బారావు, వెంకటనాయుడు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని డొంబంగివలసలో సీతారాం ఏచూరి సంతాప సభ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, పార్టీ సభ్యులు ఎం.రియ్యన్న, ఎం.రైకన్న, కె.జగదీశ్వరరావు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో కష్టజీవుల తరపున అలుపు ఎరిగిన పోరాటం చేసిన సీతారాం ఏచూరి మృతి సిపిఎంకు, కష్ట జీవులకు, ప్రజా సంఘాలకు తీరని లోటుని అన్నారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ సంఘ పెద్దలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : మండలంలోని మల్లమ్మగూడ వద్ద సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి సిపిఎం నాయకులు దావాలా రమణారావు, ఎస్.మజ్జియా పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. దేశం, ప్రజలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో సీతారాం లేకపోవడం దేశానికి, ముఖ్యంగా సిపిఎం పార్టీకి తీరనిలోటన్నారు. ఆయన ఆశయ సాధనకు అంతా కృషి చేయడమే ఆయనకు అర్పించే ఘన నివాళ్ళు అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దూసి దుర్గారావు, కాద రాము, చిన్నారావు, భానుచంద్రరావు, చుక్క మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



లెమన్, స్పూన్ పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయినులు

ఉపాధ్యాయినులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఆదివారం పార్వతీపురంలో యుటిఎఫ్ మహిళా విభాగ ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహన్రావు మాట్లాడుతూ ఈ ఆటలు పోటీలు ఉపాధ్యాయుల్లో ఐక్యత పెంచడంతో పాటు, మానసిక ఉల్లాసానికి దారితీస్తాయన్నారు. జిల్లా అధ్యక్షులు టి రమేష్ మాట్లాడుతూ ఈ ఆటలను క్రీడా స్ఫూర్తితో, పట్టుదలతో ఆడారని జిల్లా స్థాయిలో గెలిచినవారు రాష్ట్రస్థాయికి అక్టోబర్ 4,5 తేదీల్లో విజయవాడకు వెళ్తారని అన్నారు. మహిళా ఉపాధ్యాయులకు రన్నింగ్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, చెస్, క్యారమ్స్, షాట్‌పుట్, డిస్క్ త్రో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, రాష్ట్ర కౌన్సిలర్ ఐ.రాజామణి, జిల్లా కార్యదర్శులు కె.జానకీరావు, పి.వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని 2023-24 సంవత్సరానికి వివిధ విభాగాల్లో అవార్డులకు అర్హులైన పర్యాటక సంబంధిత రంగాల వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 38 విభాగాల నుండి 41 అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను ఏపి టూరిజం వెబ్సైట్ %www.aptourism.gov.in% నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని, పూర్తి చేసిన వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడలో ఈనెల 22లోగా అందజేయాలని కోరారు.

కురుపాం ఎపిఆర్‌జెసిలో సమస్యల తిష్ట

- తరగతి గదుల్లోనే పడక
- ఐదు లేబోరేటరీలకు ఒకటే గది
- అరకొరగా మరుగుదొడ్లు
- తుప్పలు, డొంకలతో భయానక వాతావరణం
- జనరేటర్ లేక అంధకారం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / కురుపాం

కురుపాం ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (ఎపి టిడబ్ల్యుఆర్ స్కూల్ / యుఆర్‌జెసి గర్ల్స్)లో సమస్యలు తిష్టవేశాయి. చాలా ఏళ్ల క్రితమే ఈ కళాశాల స్థాపించినప్పటికీ స్థల గుర్తింపు, భవన నిర్మాణాల్లో జాప్యం వల్ల 2018లో సుమారు 10ఎకరాల విస్తీర్ణంలో భవనాలు నిర్మించారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇక్కడ విద్యార్థులు ఉంటారు. ఏటా సుమారు 600ల వరకు విద్యార్థుల సంఖ్య ఉంటోంది. గత ఏడాది 602 మంది ఉండగా, ఈ ఏడాది 695మంది ఉన్నారు. ఉన్నంతలో విద్యాబోధన బాగానే ఉంటోంది. టెన్త్, ఇంటర్‌లో మార్కుల శాతం కూడా మెరుగ్గానే ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. ఇటువంటి సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులకు తగిన సౌకర్యాలు లేకపోవడం పట్ల స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఒకింత విచారం వ్యక్తం చేస్తున్నారు.

పదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భవన సముదాయం చుట్టూ పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండివుంది. రాత్రి పూట విష సర్పాలు కనిపిస్తున్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైదానమంతా ఎత్తుపల్లాలతో నిండివుండడంతో వర్షపునీరు చేరుతోంది. రోజుల తరబడి నిల్వవుండిపోవడంతో వర్షాకాలంలో ఆయా గుమ్ములు దోమల వృద్ధికేంద్రాలుగా మారాయి. దీంతో ఇక్కడి విద్యార్థులు తరచూ రోగాల బారినపడుతున్నారు. వీటికోసం ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడం గమనార్హం. దీంతో అప్పుడప్పుడూ విద్యార్థుల తల్లిదండ్రులే శ్రమదానం చేస్తూ పరిసరాలను కొంత వరకు చక్కదిద్దుతున్నారు. విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో శ్రమదానం కూడా సరిపోని పరిస్థితి దాపురించింది.

వసతి లేమి...

వసతి లేమితో ఒకే గదిలో ఐదు గ్రూపులకు చెందిన లేబొరేటరీలు నడుస్తున్నాయి. వాస్తవంగా ఇక్కడ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీతో పాటు స్కూల్ లేబొరేటరీలు విడివిడిగా ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ గదులు పరిమితంగా ఉండడం వల్ల వీటన్నింటినీ ఒకే గదిలో పెట్టారు. దీంతో, ప్రయోగాత్మక తరగతులు సకాలంలో నిర్వహించలేని పరిస్థితి. ప్రయోగశాలగా ఉపయోగించే గది కూడా సంబంధిత పరికరాలతోనే నిండివుండడంతో విద్యార్థులు ఒకింత ఇరుగ్గా కూర్చోవాల్సిన పరిస్థితి ఉంది. సుమారు 600మంది విద్యార్థులు గల ఈ వసతి గృహంలో డైనింగ్ హాల్ వందమందికి కూడా సరిపోని పరిస్థితి. దీంతో, ఎండైనా, వానైనా విద్యార్థులు చెట్ల కింద లేక ఆరు బయట భోజనాలు ఆరగించాల్సిందే.

అరకొరగా మరుగుదొడ్లు

వందలాది మంది విద్యార్థులు ఉంటున్న ఈ వసతిగృహంలో మరుగుదొడ్లు కూడా సరిపడినన్ని లేవంటే అతిశయోక్తి కాదు. కేవలం 45మరుగుదొడ్లు ఉన్నాయి. ఇందులోనూ ప్రస్తుతం కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. మరుగుదొడ్లకు గానీ, భవన సముదాయానికిగానీ తగిన డ్రైనేజీ సిస్టమ్, ఇంటర్నల్ రోడ్లు లేవు. దీంతో వాడుక నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతోంది. వ్యాధులు ప్రబలడానికి ఇది కూడా ఒక కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కానరాని వైద్యపరీక్షలు

ప్రతి ఆరు మాసాలకోసారి వసతి గృహంలో వైద్యపరీక్షలు నిర్వహించాల్సివుంగా, గత ఏడాది ఒక్కరోజు నిర్వహించిన వైద్యశిబిరంలో 250మంది విద్యార్థులకు మాత్రమే తనిఖీలు చేశారు. వసతి గృహంలో కనీసం జనరేటర్ సదుపాయం కూడా లేదు. దీంతో, విద్యుత్ అంతరాయం ఏర్పడితే పదెకరాల్లో విస్తీరించివున్న ఈ భవన సముదాయమంతా అంథకారమే. ఆ సమయంలో పురుగుబుట్ర వంటి విష సర్పాలు కానరాని పరిస్థితి. చాలా మంది విద్యార్థులు భయపడుతున్నారు.

సమస్యలున్న మాట వాస్తవమే

తమ వసతి గృహంలో సమస్యలు ఉన్నమాట వాస్తవమే. ఇవన్నీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తుప్పలు, డొంకలు తొలగించడానికి తమ వద్ద ప్రత్యేకంగా నిధులంటూ ఏమీ ఉండవు. వీటి తొలగింపునకు విద్యార్థుల తల్లదండ్రులే సహకరిస్తున్నారు. ఇన్వర్ట్ ఉన్నప్పటికీ విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సరిపోవడం లేదు. మరుగుదొడ్లు, ఇంటర్నల్ రోడ్లు లేకపోవడం వల్ల వర్షాకాలంలో ఇబ్బంది ఉన్నమాట వాస్తమే.

**ఎ.సత్యవతి, ప్రిన్సిపాల్
ఎపి టిడబ్ల్యుఆర్ స్కూల్ / యుఆర్‌జెసి గర్ల్స్,
కురుపాం**



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

19న ఉచిత ఇసుక పోర్టల్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉచిత ఇసుక సరఫరా కోసం పోర్టల్‌ను ఈనెల 19న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు గనులు, భూగర్భ శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పోర్టల్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నందున అందుకు అవసరమగు విధివిధానాలన్నింటిని ముందుగా పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని అన్నారు. ఇసుకను ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందని, కేవలం నిర్వహణ, తవ్వకం, రవాణా ఖర్చులను మాత్రమే వసూలు చేస్తామని ఆయన చెప్పారు. రవాణాకు వాహనాలు ముందుగానే నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు వాహనదారులు నిబంధనల మేరకు వాహనాలను నమోదు చేసుకోవాలని సూచించారు. వాహనాలు ఫిట్ నెస్ కలిగి ఉండాలని, జిపిఎస్ పరికరం, టార్పాలిన్ ఉండాలని, ఏ ప్రదేశం నుండి రవాణాకు సిద్ధంగా ఉన్నది తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు. రవాణాకు దూరం, వాహనం రకం కారణంగా రుసుం లెక్కించడం జరుగుతుందని ఆయన చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా రవాణా శాఖ అధికారి ఎం శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్ రద్దు


ప్రజాశక్తి - సీతంపేట

మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో సోమవారం గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయ ప్రయాసలు పడి ఐటిడిఎకు రావద్దని పిఒ కోరారు.

దేశ ప్రగతిలో ఇంజినీర్లది కీలకపాత్ర

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

దేశ నిర్మాణంలోనూ, ప్రగతిలోనూ ఇంజనీర్లది కీలక పాత్ర అని విశ్రాంత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజీ అన్నారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం పురస్కరించుకొని నిర్వహించే జాతీయ ఇంజనీర్ల దినోత్సవం ఆదివారం జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పిఆర్ ఈఈ రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణాజీ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో విశ్వేశ్వరయ్య పాత్ర కీలకమన్నారు. అలాగే ఆయన్ను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధిలో ఇంజనీర్ల కర్తవ్యాన్ని ప్రతిక్షణం గుర్తుచేసుకుని అంకితభావంతో పనిచేసి ఇంజనీర్లు రాష్ట్ర ప్రగతికి దోహదపడాలన్నారు. ఇఇ రవికుమార్ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లు రాష్ట్ర ప్రగతిలో కీలక పాత్ర ఇంజనీర్లదేనని, అకుంఠిత దీక్షతో పనిచేసి లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. అనంతరం జిల్లా కేంద్రాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మణరావు, జనరల్ సెక్రెటరీ చంద్రమౌళితో పాటు పలువురు డిఇలు, జెఇలు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ఇంజనీర్లు

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతి

ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - వీరఘట్టం

వైద్యుల నిర్లక్ష్యం వల్ల నిండు గర్భిణి మృతి చెందిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం ఇటుకు చెందిన వారాడ నవ్య (24) ప్రసవ నిమిత్తం తన కన్నవారి ఇల్లయిన వీరఘట్టం మండలం దశమంతపురం వచ్చింది. ఈ మేరకు ఆమె తల్లిదండ్రులు ప్రసవ నిమిత్తం వీరఘట్టంలో గల కనోష ఆసుపత్రిలో శనివారం ఉదయం 7గంటలకు చేర్చగా, వైద్యులు సాధారణ ప్రసవమవుతుందని వైద్యులు బంధువులకు తెలిపారు. అయితే సమయం మించిపోవడంతో సాధారణ ప్రసవం జరగదని, ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. వారు చెప్పిన గంటకే నవ్య మృతి చెందింది. ఆమెతో పాటు గర్భంలో ఉనన బిడ్డ కూడా మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు. అయితే నవ్య మృతికి వైద్యుల నిరక్ష్యమే కారణమని కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం వల్ల రెండు ప్రాణాలు పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. భాదితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కళాధర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన గర్భిణి నవ్య


మంత్రికి వినతిని అందజేస్తున్న మీసేవ ఉద్యోగులు

మంత్రిని కలిసిన మీసేవ ఉద్యోగులు

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మీసేవ ఉద్యోగులు ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ని కలిశారు. ఆమె నివాసంలో స్థానిక మీసేవ మేనేజర్ వి.రవికుమార్ ఆధ్వర్యాన ఉద్యోగులు కలిసి వినతిపత్రం అందజేశారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక పౌరసేవలు అందేవని చెప్పారు. గత ప్రభుత్వం మీసేవ కేంద్రాలను ఎత్తివేయడంతో తామంతా ఖాళీగా ఉన్నామని, కుటుంబాలతో ఆర్థిక ఇబ్బందుల్లో వున్నామని చెప్పారు. తమకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మీసేవ ఉద్యోగుల సంఘం నాయకులు తిరుమలరావు ఉన్నారు.

ఏజెన్సీలో ఐటిడిఎ ఏర్పాటుపై నేడు సమావేశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నేడు గుమ్మలక్ష్మీపురం వైటిసిలో ఉదయం 10 గంటలకు ఏజెన్సీలో ఐటిడిఎ ఏర్పాటు అనే అంశంపై ప్రజా ప్రతినిధులు, యువజనులతో సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక చైర్మన్ కోలక లక్ష్మణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీ అభివృద్ధిని కోరుకునే వారు తప్పకుండా ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.


విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

వరదలో మునిగి ఆస్తులు కోల్పోయిన విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు ఆధ్వర్యంలో ఆదివారంఅడ్డాపు శిల పంచాయితీ పరిధిలోని బంటువానివలసతో పాటు పలు గ్రామాల్లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకస్మిక వరదల వల్ల వారం రోజులుగా నీటిలో మునిగి సర్వం కోల్పోయిన విజయవాడకు చెందిన పలు ప్రాంతాల నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని, తమవంతు కర్తవ్యంగా ఇప్పటికే బాధితులకు సహాయక చర్యల్లో సిపిఎం పాల్గొని పలు విధాలుగా సహాయాలు అందించిందని, వారికి మద్దతుగా విరాళాలు సేకరించి సిపిఎం రాష్ట్ర నాయకుల ద్వారా ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి అధ్యక్షులు రెడ్డి వేణు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట


వరదబాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న రవి

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు విజయవాడ అతలా కుతలమైంది. ఇక్కడి వరద బాధిత కుటుంబాలకు, సహాయార్థం నున్న - విశ్వబ్రాహ్మణ కాలనీ -మా చలసాని టౌన్షిప్ ఫ్యామిలీ కుటుంబ సభ్యులు మన్యం ప్రగతి చైర్మన్ గేదెల రవి ఆధ్వర్యంలో ఆదివారం 100 కుంటుంబాలకు రూ.50 వేలు ఖరీదుతో 100 ప్యాకట్లు (చీర, లింగి, దుప్పటి, టవళ్లు అందజేశారు. మా చలసాని టౌన్షిప్ ఫ్యామిలీ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాకుళం నుంచి విజయవాడ వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. సహాయక చర్యలు సకాలంలో అందించిన కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు

అనారోగ్యంతో వైసిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పద్మాపురానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు బర్ల తులసి ప్రసాద్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయనగరం మహారాజ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆదివారం పద్మాపురం వెళ్లి బిటి ప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి పార్టీ అండగా ఉంటుందని ఆ ధైర్యపడొద్దని ధైర్యాన్ని చెప్పారు. రాజన్నదొరతో పాటు పార్టీ సీనియర్ నాయకులు గొట్టాపు ముత్యాలునాయుడు, పాచిపెంట వీరంనాయు డు(చినబాబు), డోల బాబ్జి, సలాది అప్పలనాయుడు, దండి శ్రీనివాసరావు, దండి కొండలరావు, కలవలపల్లి పెద్దిబాబు, తట్టికాయల గౌరీష్, కోరిపల్లి రవింద్ర తదితరులు నివాళులర్పించారు.

సూర్య పీఠాన్ని సందర్శించిన ఆర్‌టిఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణ శివారున గల సూర్య పీఠాన్ని ఆదివారం ఆర్‌టిఒ దుర్గాప్రసాద్ రెడ్డి, సిబ్బంది దర్శించుకున్నారు. బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి అధ్వర్యంలో తృచ సూర్య నమస్కారాలు, సౌర హోమం సకల కార్య సిద్ధి రామాయణ మంత్ర హోమాలు తదితరమైనవి జరిపించారు. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్ తదితరులు వైదిక సహకారం అందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల స్థాపించి దాదాపుగా 75ఏళ్లు కావస్తుండడంతో వచ్చే ఏడాది జూన్ 8న వజ్రోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తీర్మానించారు. 1969 నుంచి 2020 వరకు ఈ పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగించిన పూర్వ విద్యార్థులు ఒక్కొక్క బ్యాచికి ముగ్గురేసి చొప్పున వజ్రోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా అందరూ హాజరుకావాలని కోరారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని వెంకట భైరిపురంలో పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేసినట్లు సర్పంచ్ మరడ వెంకటరత్నం తెలిపారు. ఎమ్మెస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 300 మంది మహిళలకు వినాయక ఆలయం వద్ద పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు


పేదలకు చీరలు అందజేస్తున్న సర్పంచి వెంకటరత్నం

రైతన్నా ఇ- పంట కీలకమన్నా

రాయితీలు, పరిహారాలు పొందాలన్నా నమోదు తప్పనిసరి
సమీపిస్తున్న గడువు

ప్రజాశక్తి - సాలూరు రూరల్

సాగు చేస్తున్న ప్రతి రైతులు ఇ-పంటను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ప్రభుత్వం ఆదుకోవాలన్నా, పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్మలన్నా, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించాలన్నా ఇ-పంట తప్పనిసరి. ఈ నేపథ్యంలో రైతులు సాగు చేస్తున్న పంటలను సంబంధిత వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల వద్ద ఇ-పంటను నమోదు చేయడంలో అప్రమత్తంగా ఉండాలి. రైతులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలకు దూరమవుతారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతులు సాగుచేసిన పంటల సమాచారాన్ని విఎఎలు, విహెచ్‌ఎలు ఈనెల 20లోగా నమోదు చేయాలి. గడువు మీరితే యాప్‌లో సమాచారం స్వీకరించక సాగుదారులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ పంట నమోదుకు కౌలు రైతులు పంట సాగు పత్రాలు స్థానిక విఆర్‌ఒల వద్ద పొందాల్సి ఉంది. అప్పుడే వారు ప్రభుత్వ రాయితీలకు అర్హులు. మండలంలో చాలా గ్రామాల్లో రైతులు జూన్ నుండే ఖరీఫ్ పంటలకు ఉపక్రమించారు. జూన్‌లో పత్తి, జూలై లో మొక్క జొన్న, ఆగస్టులో వరి పంటలు వేశారు. గడువు సమీస్తున్న నేపథ్యంలో లక్ష్యం మేరకు ఇ-పంట నమోదుపై రైతులు అధికారులు దష్టి సారించాల్సి ఉంది.

త్వరితగతిన నమోదుకు ఆదేశాలు : ఎఒ అనురాధ పండా

ఖరీఫ్ సీజన్లో రైతులు సాగుచేసిన పంటలకు సంబంధించి ఇ-పంట నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తిచేస్తాం. విఎఎ, విహెచ్‌ఎలు ఇ-పంటను వేగంగా నమోదు చేసేందుకు ఆదేశాలు ఇచ్చామని రైతులు కూడా ఈ పంటతో పాటు ఇకెవైసి నమోదు చేసుకోవాలి. కౌలు రైతులు సిసిఆర్‌సి తప్పనిసరిగా విఆర్‌ఒ నుంచి తీసుకొని పంట నమోదు చేసుకోవాలి. మండలంలో 20 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగుచేస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో ఇ-పంట నమోదైన వివరాలిలా ఉన్నాయి. అరటి 1758 ఎకరాలు, జీడి 4235, కోకో 432, పత్తి 902, మొక్కజొన్న 2346, పామాయిల్ 3623, వరి 4,577, రాగి 919, చెరకు 50 ఎకరాలు ఇ-పంట నమోదైంది.


ఇ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

పంట నాటిన కొద్ది రోజులకే ఇ నమోదు చేయమని పై అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకురావడంపై కిందిస్థాయి సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గ్రామాల్లో వాలంటీర్లు ఉండేవారని, వారి సహాయంతో ఇకెవైసి చేసేవారమని, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సమయం దగ్గర పడుతుండడం వల్ల, ప్రస్తుతం ప్రతి రోజూ వర్షాలు పడుతుండడంతో పంట పొలాలు వద్దకు వెళ్ళలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పై అధికారులు స్పందించి మరికొద్ది రోజులు గడువు ఇచ్చినట్లయితే ప్రతి రైతు సాగుచేస్తున్న పంటలకు తప్పకుండా ఇ- పంటను నమోదు చేస్తామని చెప్పుతున్నారు.

ఎపిఎం సరెండర్

ఉత్తర్వులు జారీచేసిన కలెక్టర్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో పని చేస్తున్న విఒఎలు ఇచ్చిన ఫిర్యాదుపై వెలుగు ఎపిఎం ఇవి కిషోర్‌ను సెర్ప్ సంస్థకు సరెండర్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో పనిచేస్తున్న విఒఎలకు ఇచ్చిన గౌరవ వేతనం నుండి కొంత మొత్తాన్ని తీసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే కురుపాంలో ఓ మహిళా పొదుపు సంఘంలో ఉన్న ఆరుగురు సభ్యులు స్త్రీ నిధిలో రూ.3 లక్షలు రుణం తీసుకున్న డబ్బులు వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తి సమీప బంధువు ఖాతాల్లోకి మళ్లించారని, అలాగే నిధులు దుర్వినియోగం చేస్తున్నారని సెర్ప్ సిఇఒ, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు విఒఎలు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలతో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ విచారణ చేసి ఆర్థిక అవకతవకలు గుర్తించినట్లు తెలిసింది. డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన నివేదిక మేరకు కలెక్టర్ సెర్ప్ సంస్థకు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత 15రోజులుగా ఎపిఎం కిషోర్ సెలవులో ఉన్నారు. సెలవులో ఉన్న సమయంలో ఈ సంఘటన జరిగినట్లు తెలిసింది.

2న స్వచ్ఛ భారత్ దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం


స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 2 వరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ 2024 నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో భాగస్వామ్య సంస్థలతో ఇప్పటికే ఉన్నత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచి పోతుందన్నారు. మహాత్మా గాంధీ జయంతి వేళ ప్రతి ఏటా అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివస్‌గా పాటిస్తున్నామన్నారు. "స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత" ఇతివత్తంగా స్వచ్ఛతా హి సేవ 2024ను నిర్వహించుకుంటున్నామన్నారు.

సైనిక క్యాంటీన్ ఏర్పాటుకు స్థలం గుర్తింపు

- మాజీ సైనికుల ఇళ్ల స్థలాల సమస్యకు త్వరలో పరిష్కారం
- 61 మందికి పిఎం స్కాలర్‌షిప్
- దేశ రక్షణకు యువత కదలాలి
- 'ప్రజాశక్తి'తో జిల్లా సైనిక సంక్షేమాధికారి పి.సత్యప్రసాద్ ముఖాముఖి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి





దేశ రక్షణ రంగంలో పనిచేసేందుకు యువత కదలిరావాలని ఉమ్మడి విజయనగరం జిల్లా సైనిక సంక్షేమాధికారి కెప్టెన్ పి.సత్యప్రసాద్ కోరారు. కేవలం ఉద్యోగ, ఉపాధి కోసం కాకుండా దేశానికి సేవలందించాలనే కాంక్షతే చేరితే ఆ మేరకు మేలు జరుగుతుందని అన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని సైనికులు, మాజీ సైనికుల సౌకర్యార్థం క్యాంటీన్ ఏర్పాటుకు 40 సెంట్ల స్థలాన్ని గుర్తించామని వివరించారు. ఇళ్ల స్థలాల సమస్య కూడా త్వరలో కొలిక్కి వస్తుందని, ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. దేశం కోసం కష్టపడి పనిచేస్తున్న సైనిక కుటుంబాల సంక్షేమానికి భారత ప్రభుత్వం పలు పథకాలు కూడా అమలు చేస్తోందన్నారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో ప్రస్తుతం 61 మంది విద్యార్థులకు పిఎం స్కాలర్‌షిప్ అందుతోందని చెప్పారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

? ఉమ్మడి విజయనగరం జిల్లాలో మాజీ సైనికులు ఎంత మంది ఉన్నారు.?

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల్లో మొత్తంగా 3305 సైనిక కుటుంబాలు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం సైనికులుగా పనిచేస్తున్నవారు 2,818 మంది. మాజీ సైనిక కుటుంబాలు 487 ఉన్నాయి. వీరందరికీ సైనిక సంక్షేమ బోర్డు తరపున నిరంతర సేవలు అందుతున్నాయి.

? సైనికుల్లో జిల్లా, విభాగాల వారీగా ఎంతమంది ఉన్నారు?

ఉమ్మడి జిల్లాలో 2,818 మంది సైనికులు ఉండగా, వీరిలో అత్యధికంగా విజయనగరం జిల్లాకు చెందినవారు 2,251 మంది ఉన్నారు. ఇందులో ఆర్మీలో 1,762 మంది, నేవీలో 270మంది, ఎయిర్‌ఫోర్స్‌లో 219 మంది ఉన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 567 మంది ఉంటే, అందులో ఆర్మీలో 467మంది, నేవీలో 60మంది, ఎయిర్‌ఫోర్స్‌లో 40మంది ఉన్నారు. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి విజయనగరం జిల్లాలో సైనికులు చాలా తక్కువ మంది ఉన్నారని చెప్పొచ్చు.

? ఇళ్ల స్థలాల ప్రతిపాదన ఎంత వరకు వచ్చింది.?

ఉద్యోగ విరమణ పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం తరపున ఇళ్ల స్థలాలు పొందేందుకు అవకాశం ఉంది. ఈ విధంగా ఎంతో మంది స్థలాలు పొందారు. ఇంకా పెండింగ్‌లో ఉన్నవారి కోసం విజయనగరం జిల్లా కేంద్రంలోని గాజులరేగలో స్థలాలు ఇచ్చేందుకు చాలా ఏళ్ల క్రితమే ఫైలు నడిచింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి సమీపంలో వర్కింగ్ జర్నలిస్టులకు కేటాయించిన స్థలం పక్కన 301 మంది మాజీ సైనిక కుటుంబాల వారికి స్థలాన్ని కూడా గుర్తించారు. ప్రభుత్వమే ఆమోదం తెలిపినప్పటికీ అధికారికంగా సబ్‌డివిజన్ కాలేదు. ఈ ప్రక్రియ పూర్తిచేసేందుకు కలెక్టర్, మంత్రి శ్రీనివాస్ దృష్టిలో పెట్టాం. వారు కూడా సానుకూలంగా స్పందించారు. త్వరలో పట్టాలు అందుతాయని ఆశిస్తున్నాం.

? జిల్లాలో సైనిక క్యాంటీన్ ఏర్పాటు చేసే అవకాశం ఉందా.?

ఔను! ఈ ప్రాంతంలోని సైనిక కుటుంబాల ఆకాంక్ష ఇది. వీరంతా స్థానికంగా క్యాంటీన్ సదుపాయం కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. కానీ, సంఖ్యా పరంగా ఫీజుబిలిటీ లేకపోవడం వల్ల జాప్యం జరిగింది. కనీసం 10 వేల సైనిక కుటుంబ సభ్యులు ఉండాలన్న నిబంధన ప్రస్తుతం ఉమ్మడి విజయనగరం జిల్లా అధిగమించింది. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మా దరఖాస్తు మేరకు గాజులరేగ రెవెన్యూ పరిధిలో 40 సెంట్ల స్థలాన్ని అధికారులు గుర్తించారు. అధికారులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉంది. త్వరలోనే స్థలాన్ని అప్పగించే అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రక్రియ పూర్తికాగానే సైనిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యానే క్యాంటీన్ ఏర్పాటవుతుంది.

? ఎంతమందికి పిఎం స్కాలర్‌షిప్ ఇచ్చారు.?

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో పిఎం స్కాలర్‌షిప్ కోసం ఈ ఏడాది 71 దరఖాస్తులు అందాయి. ఇందులో 61 మందికి స్కాలర్‌షిప్ మంజూరు చేశాం. మిగిలినవి వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. ఈ పథకం కింద బాలురుకు రూ.2500, బాలికలకు రూ.3 వేలు చొప్పున ప్రతి నెలా అందుతున్నాయి. ఇవన్నీ ఏటా రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది.

? సైనిక రంగంలో యువత పాత్ర గుర్తించి మీ సందేశమేమిటి.?

ఒకప్పుడు దేశభక్తితో సైనిక దళాల్లో చేరేవారు. వారిలో కనిపించే తెగువ, స్ఫూర్తి, సంకల్పం ఎదుటివారికి ముఖ్యంగా యువతకు ఎంతో ఆదర్శంగా ఉండేది. ప్రస్తుతం అటువంటి విలువలు తగ్గుతున్నాయి. ఇందుకు అనేక కారణాలు ఉండడొచ్చు. కానీ, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కాకుండా దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలనే ఆకాంక్షతో చేరాలనేది నా కోరిక.

వంతెనలకు మోక్షమెప్పుడో..?

శిథిలావస్థకు చేరిన గుమ్మగదబవలస, మొండెంఖల్ వంతెనలు

ప్రజాశక్తి - కురుపాం

పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా దశాబ్దాల క్రితం నిర్మించి శిథిలావస్థలో ఉన్న వంతెనలకు మాత్రం మోక్షం కలగడం లేదు. ఇరుకైన వంతెనలతో ప్రయాణికులకు, వాహనదారులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని గుమ్మ పంచాయితీ గదబవలస సమీపాన, మొండెంఖల్ పంచాయతీ ఇచ్చాపురం సమీపంలో దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రధాన వంతెనలపై రెండు వాహనాలు ఒకే సమయంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉంది. ఒక వాహనం వెళ్లిన తర్వాతే ఎదురుగా వచ్చే వాహనం వెళ్లాలి. ఈ వంతెనలు అంత ఇరుగ్గా ఉన్నాయి. భారీ వాహనాలు ఈ వంతెనలపై వెళ్లే సమయంలో ట్రాఫిక్ నిలిచిపోతుంది. వంతెనలు శిథిలావస్థకు చేరడం, రక్షణ గోడలు విరిగిపోవడం, ఇరుగ్గా ఉండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాల్లో కలిసి పోవాల్సిందే. గతంలో ఈ వంతెనలపై ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులు కావడం వంటి సంఘటన ఎన్నో ఉన్నాయి.

ఈ వంతెనలపై నుంచి ఒడిస్సాకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఇవి శిథిలా వ్యవస్థకు చేరుకున్నాయి. రెండు ప్రధాన రహదారుల వద్ద వంతెన రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి. దీంతో ప్రమాదభరితంగా మారాయి. నిత్యం వాహనాలు ఈ రోడ్డు నుంచి ఒడిశా, శ్రీకాకుళం జిల్లా వెళ్లేందుకు ఈ రోడ్డే ప్రధాన మార్గం. ఈ రహదారిపై వంతెన ఇరుకుగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనలు మరమ్మతులు, నిర్మాణం పనులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న గుమ్మ గదబ వలస సమీపంలో గల వంతెన

తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలి

కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ వంతెనలతో ప్రతిరోజూ ప్రయాణికులు, వాహన చోదుకులు ట్రాఫిక్ కష్టాలు పడుతున్నారు. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. ప్రస్తుతం తాత్కాలికంగానైనా వంతెనకు మరమ్మతులు చేపట్టి ఇరువైపులా రక్షణ గోడలు, వంతెనల ముందు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

ఎం. శ్రీనివాసరావు
సిపిఎం నాయకులు

నూతన వంతెన నిర్మించాలి

ఇచ్చాపురం సమీపంలో ఉన్న వంతెన మరి దారుణంగా ఉంది. కనీసం ఇరువైపులా రక్షణ గోడలు కూడా లేకపోవడంతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. కావున అధికారులు తక్షణమే స్పందించి వంతెన కూలకముందే కొత్త వంతెన నిర్మించాలి.

ఐ .రామకష్ణ
టి ఆర్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు

రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం


ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న గ్రామస్తులు

తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కురుపాం ఎమ్మెల్యే టి.జగదీశ్వరికి కురుపాం మండలం నీలకంఠాపురం పంచాయతీ మహేంద్రపురం గ్రామ గిరిజనులు ఆదివారం వినతి పత్రం అందించారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో వైద్య సేవలందడం లేదని, రాకపోకలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. నిత్యవసర వస్తువులు, ఇతర పనుల నిమిత్తం బయట గ్రామాలకు వెళ్లాలంటే అష్ట కష్టాలు పడాల్సి వస్తుందని తెలిపారు. సమస్యను విన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మహేంద్రపురానికి రహదారి నిర్మాణం కోసం ప్రతిపా దనను పంపించి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గిరిజనుల ఆరోగ్యం పట్ల అప్రమత్తం

ప్రజాశకి - సాలూరురూరల్

మారుమూల గిరిజన గ్రామాల్లోని ప్రజల ఆరోగ్యం పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ టి.జగన్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు డిపిఎంఒ డాక్టర్ రఘుకుమార్‌తో కలిసి పెద్దవలస, తాడిలోవ, దిగువ దాగరవలసను ఆదివారం సందర్శిం చారు. అక్కడ గ్రామస్తులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసు కున్నారు. మాతా, శిశు సంక్షేమ కార్డులో గర్భిణీల, శిశువుల ఆరోగ్య తనిఖీల వివరాలు పరిశీలించి తగు సూచనలు చేశారు. పౌష్టికా హారం గర్భిణీలు వినియోగించుకొనేలా పర్యవేక్షించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు వారికి ఏ మేరకు దూరంలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి నెలా వైద్య శిబిరాలు గ్రామంలో నిర్వహిస్తున్నారా, ప్రస్తుతం గ్రామంలో ఆరోగ్య పరిస్థితులపై తెలుసుకున్నారు. గర్భిణీలు, బాలింతలు, ఐదేళ్లలో పిల్లలు, బాలికల్లో రక్తహీనతతో ఉన్న వారిని గుర్తించారా అని సిబ్బందిని ఆరా తీశారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, సిరప్స్ నిర్దేశించిన మోతాదులో సకాలంలో వేయించాలని, హైరిస్క్ సమస్యలను గుర్తించాలని ఆదేశిం చారు. గ్రామంలో జ్వరాలు, సీజనల్ వ్యాధుల ప్రభావం గురించి తెలుసుకొని జ్వర లక్షణాలతో ఉన్న ఇద్దరి పిల్లల ఆరోగ్య స్థితి పరిశీలించారు. నిర్ధారణ పరీక్షలు, మందులు వైద్య సిబ్బంది వద్ద అందుబాటులో ఉంచాల న్నారు. గ్రామస్తులకు పలు ఆరోగ్య పరమైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో వైద్యాధికారి డాక్టర్ రవికిరణ్, సూపర్వై జర్లు నాగేంద్ర, సతీష్, సిబ్బంది ఉన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న ఎడిఎ శారద

తెగుళ్ల నివారణపై శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

పంటలకు సోకే తెగుళ్ళు, పురుగుల నివారణ, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన మండలంలోని గుచ్చిమి రైతులకు వ్యవసాయాధికారులు ఆదివారం శిక్షణ ఇచ్చారు. గుచ్చిమిలో రైతు సేవా కేంద్రంలో రైతులకు జిల్లా వనరులు కేంద్రం నుంచి విచ్చేసిన ఎడిఎలు ఆర్.శ్రీనివాస్, శారద మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని సూచించారు. ఈ ఏడాది 1300 పరీక్షలు మండలంలో నిర్వహించామని వచ్చే ఏడాది శాంపిల్ ఎక్కువగా తీసి రైతులకు దాని కనుగుణంగా ఎరువులు వేయించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. దేశీయ ఆవు మూత్రం, పేడలో ఎన్నో మేలు చేసే బ్యాక్టీరియా ఉంటుందని, కావున వాటితో తయారు చేసే ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, అలాగే వేపకషాయాలు, పుల్లటి మజ్జిగ వంటి ద్రావణాలు వరి చేళ్లలో వాడుకొని ఆరోగ్యమైన పంటలను పండించాలని రైతులకు తెలిపారు. అలాగే గుచ్చిమిలో పొడతెగులు ఎక్కువగా ఆశించిందని, దుబ్బులను పరీక్షించి రైతులకు హెక్షాకోనోజోల్ 2మిలీ /లీటర్ నీటికి లేదా ప్రొపికోనోజోల్ 2మిలీ/ లీటర్ నీటికి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, విఎఎ ప్రణీత్, సిఇఒ, పిఎసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


పోలీసులు స్వాధీనంచేస్తున్న పిడిఎస్ బియ్యం

6500 కిలోల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ఉల్లిభద్రలో ఇర్ఫాన్ కోళ్లఫారంలో ఆదివారం తనిఖీ నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన 6500 కేజీల పిడిఎస్ బియ్యాన్ని రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కోళ్లఫారం సీజ్ చేసి, కోళ్లఫారం యజమాని ఇర్ఫాన్, బిడ్డిక సూరన్నపై సెక్షన్ (6ఎ)ఈ సి యాక్ట్, క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు, పౌర సరఫరాల ఉప తహశీల్దార్ రామారావు పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్ కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.